ఈ రేస్‌పై చర్చకు పట్టుబడుతూ శాసనసభలో స్పీకర్ పోడియం ఎదుట ప్లకార్డులు ప్రదర్శిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులను తప్పుబడుతూ శాసనమండలి ఎదుట నిరసన వ్యక్తంచేస్తున్న ఎమ్మెల్సీలు

# కేటీఆర్‌పై కేసు అక్రమం

**ఫార్ములా ఈ-కార్ రేస్‌పై చర్చకు పట్టుబట్టిన బీఆర్ఎస్ • దద్దరిల్లిన ఉభయసభలు.. పోడియం ఎదుట ఆందోళన**

**చర్చకు అనుమతించని స్పీకర్, మండలి చైర్మన్ • అసెంబ్లీ, మండలిలో పట్టువీడని బీఆర్ఎస్ సభ్యులు**

**హోరెత్తిన నినాదాలు.. ఒకటికి రెండుసార్లు వాయిదా • అసెంబ్లీలో నిరసనల మధ్యనే పొంగులేటి ప్రసంగం**

**అసెంబ్లీలో పోటాపోటీగా అధికార, ప్రతిపక్షాల నినాదాలు • శాసన మండలిలో చేతులెత్తేసిన సర్కార్.. సభ నేటికి వాయిదా**

- మేం తప్పు చేయలేదు.. రాష్ట్రం కోసమే పనిచేశాం
- తప్పు అంటున్నవారు చర్చ పెట్టి అదేమిటో చెప్పండి
- ఎమ్మెల్యే కేటీఆర్‌పై అక్రమ కేసు పెట్టారు
- ఆయనకు చెప్పుకొనే అవకాశం ఇవ్వాలి
- అసెంబ్లీలో హరీశ్‌రావు డిమాండ్

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కేటీఆర్‌పై పెట్టిన ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసు శుక్రవారం ఉభయసభల్లో ప్రకంపనలు సృష్టించింది. కేసుపై చర్చించాలని పట్టుబడుతూ బీఆర్ఎస్ సభ్యులు చేపట్టిన ఆందోళనలతో శాసనసభ, శాసనమండలి దద్దరిల్లాయి. అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఆందోళనల మధ్యనే భూ భారతి బిల్లుపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ప్రసంగించగా, మండలిలో బీఆర్ఎస్‌ను ఎదుర్కోవడంలో అధికారపార్టీ పూర్తిగా విఫలమైంది. మండలిలో శుక్రవారం మూడు బిల్లులను ప్రవేశపెట్టాల్సి ఉండగా, ప్రభుత్వం ఆ పని చేయలేకపోయింది. కేటీఆర్‌పై కేసును నిరసిస్తూ బీఆర్ఎస్ సభ్యులు శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి ఉభయసభలకు హాజరయ్యారు. ఈ-కార్ రేసింగ్‌పై చర్చించాలని ఉభయసభల్లోనూ పట్టుబట్టి, సభను అడ్డుకున్నారు. దీంతో ఒకటికి రెండుసార్లు ఉభయసభలు వాయిదాపడ్డాయి. శాసనమండలిలో మూడోసారి సమావేశమైన తరువాత కూడా సభ అదుపులోకి రాకపోవడంతో చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సభను శనివారానికి వాయిదా వేశారు.

**దమ్ముంటే ఉంటే చర్చపెట్టండి**

శుక్రవారం అసెంబ్లీ సమావేశాలు ప్రారంభంకాగానే భూభారతిపై చర్చను చేపట్టనున్నట్టు స్పీకర్ ప్రకటించారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి మాట్లాడే అవకాశమిచ్చారు. ఈ-కార్ రేసింగ్‌పై చర్చను అనుమతించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కోరారు. రెండు చేతులెత్తి దండం పెడుతూ.. 'స్పీకర్ సార్ చర్చకు అనుమతించండి' అని విజ్ఞప్తి చేశారు. 'ప్రశ్నోత్తరాలు ఎలాగూ లేవు. రాత్రి 12 గంటల వరకు చర్చిద్దాం.. ఈ-కార్ రేసింగ్‌పై చర్చకు అనుమతించాలి' అని కోరారు. ప్రభుత్వానికి దమ్ము, చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీలో చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. అయినా స్పీకర్ అనుమతించలేదు.

**కేటీఆర్‌ను అప్రతిష్ఠపాలు చేసేందుకే**

కేటీఆర్‌ను అప్రతిష్ఠపాలు చేసి బీఆర్ఎస్‌ను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. అసెంబ్లీ నడిచే సమయంలో ఒక ఎమ్మెల్యేపై అక్రమ కేసు పెట్టారని, ఫార్ములా-ఈ కార్ రేస్‌పై చర్చకు స్పీకర్ చాంబర్‌లో కలిసి విజ్ఞప్తి చేశామని తెలిపారు. ఫార్ములా-ఈ కార్ రేస్ అంశంలో రకరకాల లీకులు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తాము తప్పు చేశామంటున్నారని, సభలో చర్చించి అదేదో చెప్పాలని డిమాండ్ చేశారు. తాము చేసింది ఎందుకు తప్పుకాదో ఈ సభ ద్వారా తాము కూడా ప్రజలకు చెప్తామని స్పష్టంచేశారు. ప్రభుత్వం పెట్టింది అక్రమ కేసు కాకుంటే సభలో చర్చించాలని సవాల్ చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్ పోడియం ముందు ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో సభను స్పీకర్ వాయిదా వేశారు.

**కొనసాగిన ఆందోళన..**

మళ్లీ సభ ప్రారంభంకాగానే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ బీఆర్ఎస్ సభ్యులను సముదాయించే ప్రయత్నం చేశారు. భూ భారతిపై చర్చ అనంతరం తన చాంబర్‌కు పిలిపించి మాట్లాడతానని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ సభ్యులు శాంతించలేదు. ఇదే సమయంలో మంత్రి పొంగులేటికి స్పీకర్ మాట్లాడే అవకాశమిచ్చారు. భూ భారతిపై మంత్రి పొంగులేటి మాట్లాడారు. ఆ తర్వాత బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రసంగించారు. మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతున్నప్పుడు 'బడే భాయ్.. ఛోటే భాయ్' అంటూ బీఆర్ఎస్ సభ్యులు నినాదాలు చేశారు. దీంతో స్పీకర్ సభను వాయిదావేశారు. విరామం తర్వాత అసెంబ్లీ ప్రారంభం కాగానే బీఆర్ఎస్ సభ్యులు నిరసన కొనసాగించారు. నిరసనగా బయటకు వెళ్లిపోయారు.

**కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఆందోళన**

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఆందోళనకు పోటీగా అసెంబ్లీలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆందోళనకు దిగారు. కొందరు సభ్యులు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సీట్ల వైపు దూసుకొచ్చారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అత్యంత వేగంగా హరీశ్‌రావును సమీపించారు. 55 మంది మార్షల్స్ సభలో మోహరించారు.

## ఆ ఎమ్మెల్యే వైఖరి వివాదాస్పదం

సభలో షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకరయ్య వైఖరి వివాదాస్పదమైంది. ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై ఆయన పేపర్ విసిరే ప్రయత్నం చేస్తున్న వీడియో సోషల్‌మీడియాలో వైరల్ అయ్యింది. ఆ తర్వాత ఆయన చెప్పు తీసి విసరబోయారని, వాటర్ బాటిల్ విసిరేయబోయారంటూ సోషల్ మీడియాలో వార్తలొచ్చాయి. ఇటీవలే వీర్లపల్లి శంకరయ్య వెలమ కులంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. భౌతిక దాడులకు దిగుతామని బెదిరించారు. 'వెలమల్లారా ఖబర్దార్.. కుట్రలు చేసే వెలమల వీపులు విమానాలు మోగుతాయ'ంటూ అసభ్య పదజాలంతో దూషించారు. ఈ నేపథ్యంలో తాజా వివాదం మొదలైంది.

## మండలిలో చేతులెత్తేసిన సర్కార్

- పది నిమిషాలైనా సాగకుండానే సభ వాయిదా
- మూడు బిల్లులు ప్రవేశపెట్టలేకపోయిన ప్రభుత్వం

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): మాజీ మంత్రి కేటీఆర్‌పై పెట్టిన ఫార్ములా-ఈ రేస్ కేసును ఎత్తివేయాలంటూ బీఆర్ఎస్ సభ్యులు చేసిన ఆందోళనలతో శాసనమండలి దద్దరిల్లింది. ఒకటికి రెండుసార్లు సభను వాయిదా వేసినా పరిస్థితి అదుపులోకి రావడంతో చివరకు ఏ చర్చా జరగకుండానే మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సభను శనివారానికి వాయిదా వేశారు. మండలిలో ప్రతిపక్ష నేత మధుసూధనాచారి ఆధ్వర్యంలో శుక్రవారం నల్లబ్యాడ్జీలతో హాజరైన బీఆర్ఎస్ సభ్యులు సమావేశాన్ని స్తంభింపచేశారు. కేటీఆర్‌పై పెట్టిన ఫార్ములా-ఈ రేస్ కేసును ఎత్తివేయాలని ఆందోళనకు దిగారు. సభ సాగకపోవడంతో చైర్మన్ తొలుత 15 నిమిషాలపాటు వాయిదా వేశారు. ఉదయం 11:20 గంటలకు మండలి సమావేశం తిరిగి ప్రారంభమైనప్పటికీ, బీఆర్ఎస్ ఆందోళనలకు దిగింది. చర్చ లేకుండానే చైర్మన్ సభను శనివారానికి వాయిదా వేశారు. బీఆర్ఎస్ సభ్యులు మీడియా పాయింట్ వద్ద నిరసన తెలిపారు.

**చైర్మన్ వారించినా**

కేటీఆర్‌పై పెట్టిన కేసు ఎత్తివేయాలని సభలో చర్చ పెట్టాలన్న డిమాండ్లతో ఆందోళనకు దిగిన బీఆర్ఎస్ సభ్యులను మండలి చైర్మన్ వారించే ప్రయత్నం చేశారు. బీఆర్ఎస్ సభ్యులు వెనక్కి తగ్గలేదు. కేసుపై చర్చ జరగాలని పట్టుబట్టారు. ఈ నేపథ్యంలో చైర్మన్, మంత్రులు నిశ్చేష్టులయ్యారు.

## లోకం పోకడ

ఐదేళ్లలో ఆరు గ్యారంటీలు అమలు చేయడం ఎలా? పుస్తకం వుందా?

## విపక్షాలకు మైక్ కట్

- మీడియా పాయింట్‌లోనూ వాళ్లే మాట్లాడ్తరు
- కొత్త రూల్.. అంటూ పోలీసుల దబాయింపు
- అధికారపక్షానికి మాత్రం అన్ని అనుమతులు
- బీఆర్ఎస్ సభ్యులకు అడుగడుగునా ఆంక్షలే..

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): అధికారపక్షం ఏది చేసినా ఒప్పే.. ప్రతిపక్షం ఏది చేసినా తప్పే.. అన్నట్టుగా వ్యవహరిస్తున్నది కాంగ్రెస్ సర్కారు. శాసనసభలో జరుగుతున్న పరిణామాలే ఇందుకు నిదర్శనం. సభలో, మీడియా పాయింట్ వద్ద మాట్లాడే విషయంలో, నిరసన తెలిపే అంశంలో ఈ వ్యత్యాసాలు స్పష్టంగా కనిపించాయి. శాసనసభలో తమ అభిప్రాయం చెప్పేందుకు విపక్షాలకు మైక్ ఇవ్వకుండా గొంతు నొక్కేస్తున్నారు. ఇదే విషయాన్ని పలుమార్లు బీఆర్ఎస్ సభ్యులు మీడియా ఎదుట వాపోయారు. సభను వాకౌట్‌చేసి మీడియా పాయింట్ వద్ద మాట్లాడేందుకూ విపక్షానికి అవకాశం ఇవ్వడం లేదు. కొత్త రూల్ అంటూ పోలీసులు అడ్డుకుంటున్నారు. శుక్రవారం సభను వాకౌట్ చేసిన అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కేపీ వివేకానంద, డాక్టర్ సంజయ్, విజయుడు, పాడి కౌశిక్‌రెడ్డి అసెంబ్లీ మీడియా పాయింట్ వద్దకు వస్తుండగా.. పది మంది మార్షల్స్ అడ్డుకున్నారు. వాకౌట్‌కు కారణాలు, సభలో పరిస్థితులపై మీడియా ద్వారా ప్రజలకు వివరించే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. అటు సభలో, ఇటు మీడియా పాయింట్‌లో ప్రధాన ప్రతిపక్షం గొంతు వినిపించకుండా ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అంటున్నారు. అధికారంలో ఉండి కూడా అటు సభలో, ఇటు మీడియా పాయింట్‌లోనూ వాళ్లే మాట్లాడుతున్నారని, ఇది ఎంతవరకు సమంజసమో అధికారపక్ష ఎమ్మెల్యేలు ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచిస్తున్నారు. అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ సభ్యులు నిరసన తెలుపడంపైనా సర్కారు ఆంక్షలు విధిస్తున్నది.

## మా భూమి ఇచ్చేదిలేదు..

- ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలి
- అధికారులపై కాంగ్రెస్ ప్రజాప్రతినిధి ఒత్తిడి
- డ్రాఫ్ట్ నోటిఫికేషన్ జారీ చేసిన కుడా

వరంగల్, డిసెంబర్ 20 : ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి తమ భూమి ఇచ్చేందుకు అధికార పార్టీ ప్రజా ప్రతినిధి ససేమిరా అంటున్నారు. మాస్టర్‌ప్లాన్‌లో ఉన్న అలైన్‌మెంట్ మార్చాలంటూ కూడా అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. అధికార పార్టీలో ఉంటే ఏదైనా చేయొచ్చనే అధికారులపై ఒత్తిడి తెస్తూ, ఏకంగా అలైన్‌మెంట్ మార్పు కోసం డ్రాఫ్ట్ నోటిఫికేషన్ జారీ చేయించారు. దీంతో అధికార పార్టీ నేతలకు ఒక న్యాయం, సామాన్య రైతులకు మరో న్యాయమా? అంటూ ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన మాస్టర్ ప్లాన్-2041లో ప్రతిపాదించిన 200ఫీట్ల రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చాలని నగరానికి చెందిన ఒక ప్రజాప్రతినిధి కుడా అధికారులపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెస్తున్నట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. వరంగల్ నాయుడు పెట్రోల్ పంపు నుంచి ఎనుమాముల మీదుగా ఆరెపల్లి వరకు వెళ్లే ఇన్నర్‌రింగ్ రోడ్డు నిర్మాణంలో భాగంగా కుడా అధికారులు భూ సేకరణ చేపట్టారు. అయితే ఎనుమాములలో 280 సర్వే నంబర్‌లో 1.20ఎకరాల భూమి సదరు ప్రజాప్రతినిధికి ఉంది. ఆ భూమి ఇన్నర్‌రింగ్ రోడ్డు ప్లాన్‌లో ఉంది. అయితే తన భూమి రోడ్డులో పోకుండా ఏకంగా అలైన్‌మెంట్‌ను మార్చాలని అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో కుడా అలైన్‌మెంట్ మార్పుపై పక్షం రోజుల కిత్రం డ్రాఫ్ట్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పు చేయొద్దని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో ఎనుమాముల మార్కెట్ వద్ద పార్టీ శ్రేణులు శుక్రవారం ఆందోళన చేపట్టాయి.

ఆందోళన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, బీఆర్ఎస్ శ్రేణులు

**ప్రభుత్వ ఆదేశాలతో నోటిఫికేషన్**

ప్రభుత్వ ఆదేశాలతోనే ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పుపై డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ఇచ్చాం. అలైన్‌మెంట్‌పై ఎలాంటి అభ్యంతరాలున్నా చెప్పాలని ప్రజలకు సూచించాం. ప్రజల అభిప్రాయాలను మళ్లీ ప్రభుత్వానికి నివేదిస్తాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటాం.

– అజిత్‌రెడ్డి, కుడా ప్లానింగ్ అధికారి

### ఐఆర్ఆర్ అలైన్‌మెంట్ మార్చొద్దు

**మాజీ ఎమ్మెల్యే నన్నపునేని ఆధ్వర్యంలో ఆందోళన**

కాశీబుగ్గ, డిసెంబర్ 20 : ఏనుమాముల మార్కెట్ వద్ద మాస్టర్ ప్లాన్ 2041 ప్రకారం 200 ఫీట్ల ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చొద్దని, ఇందుకోసం కుడా ఇచ్చిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన కొత్త డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌కు వ్యతిరేకంగా బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఏనుమాముల మార్కెట్ ప్రధాన రోడ్డుపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నన్నపునేని మాట్లాడుతూ నోటిఫికేషన్‌కు వ్యతిరేకంగా ప్రభుత్వ కార్యదర్శి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌కు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఏనుమాముల మార్కెట్ ప్రాంత ప్రజలకు అన్యాయం చేయాలని చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం తన తీరు మార్చుకోకుంటే ప్రజలు తిరగబడతారన్నారు. నాయకుల స్థలాలను కాపాడుకోవడానికి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే ఊరికునేది లేదని హెచ్చరించారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వం కండ్లు తెరిచి ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని, లేకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. పాత అలైన్‌మెంట్‌నే అమలు చేయాలని నరేందర్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి, రైతు బంధు సమితి మాజీ అధ్యక్షురాలు ఎల్లావుల లలితాకుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీ రమేశ్‌బాబు, మాజీ కార్పొరేటర్ కుందారపు రాజేందర్, కుడా మాజీ డైరెక్టర్ మోడెం ప్రవీణ్, నాయకులు కేతిరి రాజశేఖర్, చిమ్మని సంతోష్, పత్రి రాజపోశాలు, గంధం గోవింద్, గండ్రాతి భాస్కర్, సిలువేరు పవన్, ఎండీ ఇక్బాల్, జక్కి యుగేంధర్, పున్నం ప్రభాకర్, జంగం రాజు, వీరాచారి, బొల్లె సాంబయ్య, గంగరాజు విజయ, ఎండీ జావేద్, సలీం, ఫిరోజ్, అంకెపు సతీశ్, కొత్తపల్లి అనిల్, సునీల్, పస్తం రాజేశ్, నర్సింగం, చెరుకు హరిబాబు, రాపర్తి శ్రీనివాస్, ఆడెపు అశోక్, గండ్రాతి నవీన్, అశోక్, బొల్లె ప్రభావతి, గడ్డం రాజమణి, పోడిశెట్టి అన్నపూర్ణ, ఆకుల వనజ తదితరులు పాల్గొన్నారు.

## కీలక పత్రాలు మాయం!

***అజంజాహి మిల్లు భవన్ కూల్చివేతలో పలు రికార్డులు ధ్వంసం***

కాశీబుగ్గ, డిసెంబర్20: నగరంలోని 19వ డివిజన్ కాశీబుగ్గలోని అజంజాహి మిల్లు కార్మికుల యూనియన్ కార్యాలయం కూల్చివేత వివాదంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. భవనానికి సంబంధించిన విలువైన డాక్యుమెంట్లు మాయమైనట్లు ఆరోపణలు వస్తున్నాయి. జేసీబీల కూల్చివేతతో రికార్డులు, భవన, ఇతర కీలక పత్రాలు, పుస్తకాలు శిథిలాల కిందనే ధ్వంసమైనట్లు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు ఎలాంటి సమాచారం లేకుండానే యూనియన్ భవనాన్ని కూల్చివేశారని వారు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల నుంచి ఎలాంటి అనుమతి లేకుండానే వస్త్ర వ్యాపారి కూల్చినట్లు పేర్కొంటున్నారు. కార్మిక భవనంతో సహా ట్రేడ్ యూనియన్ ఆనవాళ్లు లేకుండా పోయాయని వాపోతున్నారు. రికార్డుల మాయంపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ట్రేడ్ యూనియన్ నేతలు సన్నద్ధమైనట్లు తెలిసింది. కార్మికుల భవన్ వ్యవహారంలో మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల చుట్టూ ఉచ్చు బిగుసుకుంటున్నట్లు తెలుస్తున్నది. అప్పటి ఐఏఎస్ అధికారిపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెచ్చి అక్రమాలకు తెరతీసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. వరంగల్ కలెక్టర్ సత్యశారద ఆదేశాలు బేఖాతర్ చేసినట్లు పలువురు చర్చించుకుంటున్నారు. భవనానికి సంబంధించిన డాక్యుమెంట్లను ఇప్పటి వరకు వస్త్ర వ్యాపారి రెవెన్యూ అధికారులకు ఇవ్వలేదని సమాచారం.

**ఆవేదనకు గురైన కార్మికులు**

70 ఏళ్లకు పైగా నిర్మించి ఉపయోగంలో ఉన్న అజంజాహి మిల్లు యూనియన్ కార్మికుల భవనాన్ని ఎలాంటి సమాచారం లేకుండా కూల్చివేయడంతో కార్మికులు ఆవేదన చెందుతున్నారు. భవన్ అటెండర్ పోలెపాక సుశీలమ్మతో పాటు పలువురు తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. కార్మిక భవన్ శిథిల గోడలను చూసి కన్నీటి పర్యంతమయ్యారు. ప్రస్తుతం ఉన్న కార్మికుల్లో వయోభారంతో బాధపడుతున్నవారే అధికంగా ఉన్నారు.

జనగామలో అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన వ్యక్తం చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

## సమ్మెకు టీపీటీఎఫ్, సీపీఎం మద్దతు

- కొనసాగుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగుల రిలే నిరాహార దీక్షలు
- జనగామలో అర్ధనగ్న ప్రదర్శన

హనుమకొండ, డిసెంబర్ 20: హనుమకొండ, వరంగల్ జిల్లాల సమగ్ర శిక్షా ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్), సీపీఎం పార్టీ మద్దతు తెలిపింది. హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిలా పార్కు వద్ద నిర్వహిస్తున్న ధర్నా శిబిరంలో టీపీటీఎఫ్ కరపత్రం శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి గొడిశాల సత్యనారాయణ మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేసి మినిమం టైం స్కేల్‌ను ప్రకటించాలన్నారు. కేజీబీవీ, సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కారం అయ్యేంతవరకు టిపిటిఎఫ్ సమ్మెకు మద్దతుగా నిలబడుతుందన్నారు. వీరి సమస్యలపై కరపత్రం ముద్రించి ఉద్యమ ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ పోరాటాల ద్వారానే ప్రభుత్వాలు సమస్యలు పరిష్కరిస్తాయన్నారు. మీ న్యాయమైన డిమాండ్ల కోసం సీపీఎం మద్దతుగా ఉంటుందని హామీ ఇచ్చారు. అదేవిధంగా జనగామలో దీక్షా శిబిరం వద్ద ఎస్ఎస్ఏ ఉద్యోగులు అర్ధనగ్న ప్రదర్శన చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం హనుమకొండ, జనగామ, వరంగల్ జిల్లా అధ్యక్షులు ఎండీ షఫీ, తాడూరి రమేశ్, డీ శ్రీధర్, ప్రధాన కార్యదర్శులు బీ రఘు, బైరగోని దయాకర్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కే క్రాంతి కుమార్, కోశాధికారి గోలి రవీందర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు జీ సాయిలత, సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర బాధ్యులు మొగిలి చర్ల శ్రీనివాస్, ఉద్యోగులు రాజు, జ్యోతి, మనోజ, యాదగిరి, పబ్బు రాజు, శ్రీకాంత్, గోరంట్ల యాదగిరి, ఎండబట్ల శ్రీనివాస్, రాజ్ కుమార్, రొయ్యల రాజు, కిషన్, మధు, అన్నపూర్ణ, రాధిక, మహాలక్ష్మి, సునీత, రాణి, సోని, దీనామణి పాల్గొన్నారు.

## మరో రెండు మున్సిపాలిటీలు

- స్టేషన్‌ఘన్‌పూర్, కేసముద్రంలో పురపాలికలు
- అసెంబ్లీలో ప్రకటించిన మంత్రి

స్టేషన్ ఘన్‌పూర్ ముఖచిత్రం

కేసముద్రం ముఖచిత్రం

స్టేషన్ ఘన్‌పూర్/కేసముద్రం, డిసెంబర్ 20: ఉమ్మడి జిల్లాలో మరో రెండు మున్సిపాలిటీలు ఏర్పడనున్నాయి. ఈ మేరకు స్టేషన్‌ఘన్‌పూర్, కేసముద్రంలో మున్సిపాలిటీని ఏర్పాటు చేస్తూ అసెంబ్లీలో మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటన చేశారు. స్టేషన్ ఘన్‌పూర్ పట్టణ జనాభా 20వేలు, శివునిపల్లిలో 10 వేలకు చేరుకుంది. 2023 ఫిబ్రవరి 27న హనుమకొండ జిల్లా వేలేరు మండలం సోడషపల్లి గ్రామంలో జరిగిన బీఆర్ఎస్ బహిరంగ సభలో అప్పటి మంత్రి కేటీఆర్ స్టేషన్ ఘన్‌పూర్‌ను మున్సిపాలిటీగా చేస్తామని చెప్పగా, ప్రజలు, పార్టీల అభిప్రాయం తీసుకుని అప్పటి ప్రజాప్రతినిధులు ప్రతిపాదనలు పంపించారు. ఈ నేపథ్యంలో 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ ఎస్ అధికారంలోకి రాగానే మున్సిపాలిటీగా మారుస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రకటన ఆలస్యమైంది. స్టేషన్ ఘన్‌పూర్, శివునిపల్లి, చాగల్లు గ్రామాలను కలుపుకుని మున్సిపాలిటీగా మారనుంది. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న స్టేషన్ ఘన్‌పూర్‌లో ఆర్డీవో కార్యాలయం, రైల్వే స్టేషన్, బస్టాండ్, రిజర్వాయర్ ఉండడంతో పట్టణంలో మరింత అభివృద్ధి జరుగుతుందని, ఎన్నో ఏళ్ల తమ కల నెరవేరుతోందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కేసముద్రం స్టేషన్, కేసముద్రం విలేజి, అమినాపురం, ధన్నసరి, సబ్ స్టేషన్ తండాలను కలిపి మున్సిపాలిటీగా మార్చాలని కోరుతూ 2023లో నాటి ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ ప్రతిపాదనలు పంపించారు. అయితే ఎన్నికల కోడ్ రావడం, ప్రభుత్వం మారడం, ప్రభుత్వ సలహాదారుడిగా ఈ ప్రాంతానికి చెందిన వేం నరేందర్‌రెడ్డి ఉండడంతో కేసముద్రం మున్సిపాలిటీ చేసే ప్రక్రియ మరింత వేగం పుంజుకుంది. మున్సిపాలిటీగా మార్చ.డానికి గ్రామ సభల అమోదం పంపించాలని ఈ నెల 7న మండల పరిషత్ కార్యాలయానికి ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో అధికారులు గ్రామ సభలు నిర్వహించి అన్ని గ్రామాలు అంగీకరించినట్లు నివేదికలు పంపించారు. కేసముద్రం మున్సిపాలిటీగా ఏర్పాటు కావడంతో మహబూబాబాద్ జిల్లాలో మున్సిపాలిటీల సంఖ్య 5కు చేరుకుంది. మహబూబాబాద్, తొర్రూరు, మరిపెడ, డోర్నకల్ మున్సిపాలిటీగా ఉండగా తాజాగా కేసముద్రం చేరింది.

***19438 మంది జనాభా...***

19438 మంది జనాభాతో కొత్తగా కేసముద్రం మున్సిపాలిటీ ఏర్పాటు కానుంది. కేసముద్రం విలేజి గ్రామంలో 5862, కేసముద్రం స్టేషన్‌లో 8072, ధన్నసరిలో 2214, అమినాపురంలో 2283, సబ్‌స్టేషన్ తండాలో 1007 మంది జనాభా ఉన్నారు.

**'నర్సంపేట' పరిధి పెంపునకు ప్రతిపాదనలు**

నర్సంపేట: నర్సంపేట మున్సిపాలిటీ పరిధి పెంపునకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. గతంలో నర్సంపేట మేజర్ గ్రామ పంచాయతీగా ఉండేది. దినాదినాభివృద్ధి చెందుతున్న నర్సంపేట నగర పంచాయతీగా ఏర్పడింది. ప్రస్తుతం మున్సిపాలిటీగా కొనసాగుతుండగా పరిధి పెంచేందుకు ప్రతిపాదనలు రూపొందించనున్నారు. మున్సిపాలిటీలో ప్రస్తుతం 24 వార్డులున్నాయి. నర్సంపేట మండలంలో 27 గ్రామ పంచాయతీలుండగా, వీటిలో 9 జీపీలు, తండాలను కలిపి మున్సిపల్ పరిధిని పెంచనున్నారు. నర్సంపేట మున్సిపాలిటీలో కొత్తగా 9 గ్రామాలను విలీనం చేసే ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నాయి. నర్సంపేట మండలానికి చెందిన మాధన్నపేట (జనాభా 1,586), నాగుర్లపల్లి (1,251), పర్శనాయక్‌తండా (517), ముత్తోజిపేట (1,928), రాజుపేట (1,403), మహేశ్వరం (3,669), రాములునాయక్‌తండా (655), ముగ్దుంపురం (2,346), రాజపల్లి (జనాభా-1,401) గ్రామాలు ఉండనున్నాయి.

## పారిశుధ్య కార్మికురాలికి లైంగిక వేధింపులు?

***మాట వినకుంటే ఉద్యోగం ఊడగొట్టిస్తానని శానిటరీ ఇన్‌స్పెక్టర్ బెదిరింపులు***

వరంగల్, డిసెంబర్ 20 : అండర్ రైల్వే గేట్ ప్రాంతంలో విధులు నిర్వర్తిస్తున్న ఓ శానిటరీ ఇన్‌స్పెక్టర్ పారిశుధ్య కార్మికురాలిని ఆరు నెలలుగా లైంగికంగా వేధిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. మాట వినకుంటే ఉద్యోగం ఊడగొట్టిస్తా.. అధికారులంతా తన మాట వింటారని బెదిరిస్తున్నట్లు సమాచారం. శానిటరి ఇన్‌స్పెక్టర్‌తో పాటు జవాన్ సైతం వేధిస్తుండడంతో ఎవరికీ చెప్పుకోలేక సదరు పారిశుధ్య కార్మికురాలు ఆరు నెలలుగా మానసిక వేదన అనుభవిస్తోంది. ఫోన్‌లో అసభ్యంగా మాట్లాడడం, ఎప్పుడు ఫోన్ చేసినా మాట్లాడాలని బెదిరిస్తున్నట్లు సమాచారం. దీంతో సదరు కార్మికురాలు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కంట పడకుండా పని చేసుకుంటున్నట్లు తెలిసింది. కార్మికురాలిని లైంగికంగా వేధిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్, జవాన్‌పై బల్దియా ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నది.

## గిరిజన దర్బార్ దరఖాస్తులను పరిష్కరించాలి

సమస్యలు తెలుసుకుంటున్న ఐటీడీఏ పీవో

కొత్తగూడ, డిసెంబర్ 20 : గిరిజన దర్బార్‌లో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో పాల్గొని వినతులు స్వీకరించారు. వాటికి పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కొత్తగూడ, గంగారం, గూడూరు, గార్ల, బయ్యారం మండలాల నుంచి మొత్తం 48 దరఖాస్తులు స్వీకరించారు. కొత్తగూడ మండలంలోని దుర్గారంలో కల్తి నరేశ్ సీసీ రోడ్డు మంజూరు చేయాలని, గుండ్రపల్లిగూడెం ప్రాథమిక పాఠశాలను మళ్లీ ఓపెన్ చేయడానికి అనుమతి ఇవ్వాలని, డ్రెస్‌కోడ్ ఇప్పించాలని కోరారు. వజ్జ సారంగపాణి, సంప కృష్ణబాబులు గిరి వికాసం నుంచి బోర్లు మంజూరు చేయాలని విన్నవించారు. ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.